సాక్షి నిజామాబాద్

ఆదివారం । 19 । జనవరి । 2025



ఆటలతో మానసిక ప్రశాంతత

ఆటలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా జడ్జి సునీత అన్నారు. బార్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో క్రీడలను ప్రారంభించారు.

- 8లో ▸



ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు..

నిజామాబాద్‌ నగరంలో ఇష్టారాజ్యంగా రోడ్లపై ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
29.1 /13.2

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్‌

నేడు అమృత్‌ -2 పనులు ప్రారంభం

నిజామాబాద్‌ సిటీ : మున్సిపల్‌ కార్పొరేషన్‌కు కేంద్రం అమృత్‌–2 పథకం కింద రూ.380 కోట్ల నిధులు మంజూరు చేసింది. అండర్‌ గౌండ్‌ డ్రెయినేజీ, తాగునీటి వ్యవస్థ కోసం ఈ నిధులు ఖర్చుచేయనున్నారు. దీనికి సంబంధించి పైలాన్‌ను ఆదివారం మధ్యాహ్నం మున్సిపల్‌ కార్యాలయ ఆవరణలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆవిష్కరించనున్నారు. అదేవిధంగా నగరంలోని గోల్‌హనుమాన్‌లోని జోన్‌–2 కార్యాలయ భవనాన్ని మంత్రి ప్రారంభిస్తారు. సాయంత్రం పాత రూరల్‌ తహసీల్దార్‌ కార్యాలయం ఆవరణలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు నుడా చైర్మన్‌ కేశవేణు తెలిపారు. పనులను నుడా చైర్మన్‌ కేశవేణు, నగర కాంగ్రెస్‌ నాయకుడు రత్నాకర్‌తోకలిసి పరిశీలించారు.

సింగపూర్‌ పర్యటనలో సీఎంతో పోచారం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌ : సింగపూర్‌లోని గ్లోబల్‌ ఇండియన్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ ఆడిటోరియంలో తెలంగాణ కల్చరల్‌ సొసైటీ ఆధ్వర్యంలో మీట్‌ అండ్‌ గ్రీట్‌ కార్యక్రమం జరిగింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీఎంతో పాటు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, సింగపూర్‌లోని తెలంగాణ కల్చరల్‌ సొసైటీ అధ్యక్షుడు గడప రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి వాయిదా

నిజామాబాద్‌ అర్బన్‌: ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20న జరగాల్సిన ప్రజావాణి కార్యక్రమం ఉండదని, 27న యథావిధిగా ప్రజావాణి కొనసాగుతుందన్నారు. ప్రజలు గమనించి జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.

రైతులకు అవగాహన కల్పించాలి



వేల్పూర్‌: విద్యుత్‌ ప్రమాదాల నివారణలో రైతులకు అవగాహన కల్పించాలని ట్రాన్స్‌కో టెక్నికల్‌ డీఈ రమేశ్‌ సూచించారు. వేల్పూర్‌ మండలం జాన్కంపేట్‌లో శనివారం నిర్వహించిన పొలంబాట కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వ్యవసాయ క్షేత్రాల వద్ద ట్రాన్స్‌కో సిబ్బంది నిర్లక్ష్యంతో రైతులకు ప్రమాదాలకు గురి కాకుండా చూడాలన్నారు. లైనమన్లు విద్యుత్‌ లైన్లను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, లోటుపాట్లు ఉంటే సరిచేయాలన్నారు. గ్రామంలో కరెంటు వైర్ల కింద ఉన్న మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో భీమ్‌గల్‌ డీఈఈ వినోద్‌, వేల్పూర్‌ ఏఈ యశ్వంత్‌రావు పాల్గొన్నారు.

ఆదర్శనీయం ఈ యోగారత్నం

41 ఏళ్లుగా మతాలకతీతంగా యోగాలో శిక్షణ ఇస్తున్న ఎక్కొండ ప్రభాకర్‌

వేలాది మందికి యోగాలో శిక్షణ ఇస్తూ.. వందలమంది మాస్టార్లను తయారు చేస్తూ 41 ఏళ్లుగా ముందుకు సాగుతున్నారు ఎక్కొండ ప్రభాకర్‌. ఈయన వద్ద కానిస్టేబుల్‌ నుంచి ఎస్పీ, డీఐజీ స్థాయి అధికారుల వరకు యోగా నేర్చుకున్నారు. ‘వాడవాడకు యోగా’ లక్ష్యంతో ఉచితంగా యోగా శిక్షణ ఇస్తున్న ఈయన కృషికి గుర్తింపుగా ‘యోగా రత్న’ అవార్డు అందుకున్నారు. మసీదుల్లో యోగా తరగతులు నిర్వహించారు. ఈయనకు వందల మంది మైనారిటీ శిష్యులు ఉన్నారు. తల్లిదండ్రులకు సేవ ఎలా చేయాలి, మనిషి జీవితం మీద, భక్తి గురించి 300 పైగా పాటలు రాశారు. ఆయుర్వేద వైద్యం నేర్చుకుని ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నారు.



పోలీసులకు యోగా శిక్షణ ఇస్తున్న యోగా గురువు ప్రభాకర్‌

- ఇందూరు, నిర్మల్‌ జిల్లాల్లో ఇప్పటివరకు 16 చోట్ల యోగా కేంద్రాల నిర్మాణం
- యోగా శిక్షణతో వేలాదిమందిని మాస్టార్లుగా తీర్చిదిద్దిన గురువు
- ఆయుర్వేదం నేర్చుకుని ప్రాణాంతక వ్యాధులకూ మందులు
- ఫలితం ఆశించని సేవలు
- తల్లిదండ్రులకు సేవ, మానవ జీవన విధానంపై 300 పైగా పాటలు రాసిన రచయిత
- మసీదుల్లోనూ యోగా శిక్షణ తరగతులు..



ప్రభాకర్‌

సండే స్పెషల్‌



విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తూ..

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్‌: నేర్చుకోవాలనే తపన, సేవ చేయాలనే సంకల్పం, అందుకు తగిన కృషి, పట్టుదల, జిజ్ఞాస ఉంటే చాలు చిరకాలం గుర్తుండిపోయేలా సమాజానికి చాలా చేయొచ్చు. జీవితాన్ని సార్థకం చేసుకోవచ్చు. ఇందూరు నగరానికి చెందిన ఎక్కొండ ప్రభాకర్‌ గత 41 ఏళ్లుగా ఈ దిశగా ముందుకెళుతూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు. వేల మందికి యోగా నేర్పుతూ, వందల మంది యోగా మాస్టర్లను తయారు చేస్తూ ఆ స్ఫూర్తిని కొనసాగిస్తున్నారు. ప్రభాకర్‌ సేవలకు గాను తన గురువు వెంకటేశం ద్వారా ‘యోగా రత్న’ అవార్డు అందుకున్నారు. ఇక్కడ మరింత ప్రత్యేకత ఏమిటంటే ప్రభాకర్‌ చదువుకుంది 5వ తరగతి మాత్రమే. అయినప్పటికీ తెలుగు, హిందీ, ఆంగ్లం, సంస్కృతం భాషలు మాట్లాడుతున్నారు. తెలుగులో తల్లిదండ్రులకు సేవ ఎలా చేయాలి, మనిషి జీవితం మీద, భక్తి గురించి 300 పైగా పాటలతో పుస్తకం రాశారు.

పోలీసుల విధులకు అనుగుణంగా యోగా ద్వారా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేకంగా పుస్తకం రాశారు. ఈ పుస్తకాన్ని అప్పటి జిల్లా ఎస్పీ మధుసూదన్‌రెడ్డి ఆవిష్కరించారు.

■ 1980లో గోపాల్‌సేట్‌ వద్ద యోగా గురించి తెలుసుకున్న ప్రభాకర్‌ గురువు వెంకటేశం వద్ద నేర్చుకున్నారు. 1984 నుంచి ‘వాడవాడకు యోగా’ నినాదంతో ఉచితంగా యోగా శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. జిల్లా పోలీసు విభాగంలో నిరంతరం యోగా శిక్షణ ఇస్తున్నారు. కానిస్టేబుల్‌ నుంచి ఎస్పీ, డీఐజీ స్థాయి అధికారుల వరకు ఆయన వద్ద యోగా నేర్చుకున్నారు. అన్నివర్గాల వారికి యోగా నేర్పుతూ వందల మంది యోగా మాస్టర్లను తయారు చేశారు. మసీదుల్లో సైతం యోగా తరగతులు నిర్వహించారు. ఈయనకు వందల మంది మైనారిటీ శిష్యులు ఉన్నారు. వీరంతా ప్రభాకర్‌ను ప్రతి గురుపౌర్ణమికి సత్కరిస్తున్నారు. ముస్లిం మైనారిటీ యోగా కేంద్రం సైతం ప్రభాకర్‌ ఆధ్వర్యంలో ఏర్పాటైంది. ఆయన శిష్యుడు మాస్టర్‌ షహీద్‌ ఆధ్వర్యంలో నిరంతరాయంగా నడుస్తోంది. ప్రభాకర్‌ ఆధ్వర్యంలో ఇందూరు, నిర్మల్‌ జిల్లాల్లో 16 చోట్ల పతంజలి యోగా కేంద్రాలు నిర్మాణం అయ్యాయి. జిల్లా యోగా సంఘం అధ్యక్షుడిగా పని చేశారు. ఈయన ఆధ్వర్యంలో అర్సపల్లిలో వివేకానంద యోగా కేంద్రం 2000 సంవత్సరంలో మొదలైంది. ఈ కేంద్రానికి ప్రస్తుతం రజతోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.



ప్రభాకర్‌ రాసిన యోగా ఆరోగ్య పుస్తకాన్ని విడుదల చేస్తున్న అప్పటి ఎస్పీ మధుసూదన్‌రెడ్డి

■ పండిత్‌ ఏల్చూరి వద్ద ఆయుర్వేదం సైతం ప్రభాకర్‌ నేర్చుకున్నారు. (పండిత్‌ ఏల్చూరి ద్వారానే ఆయుర్వేద వైద్యం అత్యంత ప్రాచుర్యం పొందింది). అదేవిధంగా వన మూలికల ద్వారా వైద్యం చేయడం గురువు నర్సయ్య వద్ద నేర్చుకున్నారు. 1990 నుంచి ఆయుర్వేదం, మూలిక వైద్యం చేస్తున్నారు. చుట్టుపక్కల జిల్లాలతో పాటు హైదరాబాద్‌, మహారాష్ట్రలోని నాందేడ్‌ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి చాలామంది క్యాన్సర్‌, గుండె, కిడ్నీ, పైల్స్‌, ఫిట్స్‌, గురక, సయాటికా, డిస్క్‌, సర్వైకల్‌, చిన్నపిల్లల న్యూమోనియా తదితర దీర్ఘకాలిక వ్యాధులున్నవారు వచ్చి వైద్యం చేయించుకుంటున్నారు. ‘ఆశించిన వాడు శాసించలేడు’ అనే విధానాన్ని పాటిస్తూ ఎలాంటి లాభం ఆశించకుండా పేదలకు వైద్యం చేస్తుండడం ప్రభాకర్‌ యొక్క మరో ప్రత్యేకత. యోగాను మరింత విస్తృతం చేసేందుకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ప్రభాకర్‌ చెబుతున్నారు. వాడవాడలా యోగా కేంద్రాల నిర్మాణానికి ప్రోత్సహిస్తున్నానని, ఇందుకు పలువురు ముందుకు వస్తుండడంతో ఒక్కొక్కటిగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయుర్వేదం సైతం భవిష్యత్తు తరాలకు అందించేందుకు తన వంతుగా పాటుపడతానన్నారు.



ప్రభాకర్‌కు సన్మానం చేస్తున్న మైనారిటీ శిష్యులు



యోగాసనాలు వేస్తున్న ప్రభాకర్‌

వడ్డీ ఆశచూపి.. డిపాజిట్లు ముంచేసి..

- రూ. 3 కోట్ల వరకు ఎగ్గొట్టారు..
- మెడిలైఫ్‌ కంపెనీ ప్రతినిధి అరెస్ట్‌



ఖలీల్‌వాడి: అధిక వడ్డీ ఆశ చూపి ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి మోసం చేస్తున్న చైన్‌ సిస్టం కంపెనీపై కేసు నమోదు చేసి, ఒకరిని అరెస్టు చేసినట్లు ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు.. తమిళనాడులోని తిరుచ్చి కేంద్రంగా నిర్వహిస్తున్న మెడిలైఫ్‌ కంపెనీ వారు జిల్లాలో ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించారు. డిపాజిట్లపై వారానికి నాలుగు శాతం వడ్డీ చొప్పున 52 వారాలు చెల్లిస్తామని నమ్మించారు. ఇతరులను జాయిన్‌ చేస్తే కమీషన్‌ కూడా ఇస్తామని చెప్పారు. మినీమం రూ.10 వేలు డిపాజిట్‌ చేయించుకున్నారు. దీంతో వారి మాటలను నమ్మిన వారు చాలా మంది కంపెనీలో డిపాజిట్‌ చేశారు. జిల్లాలో దాదాపు 400 మంది రూ.3 కోట్ల వరకు డిపాజిట్‌ చేశారు. కొంతకాలం వరకు వడ్డీ చెల్లించిన కంపెనీ తర్వాత మానేసింది. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించడంతో టౌన్‌ సీఐ శ్రీనివాస్‌ రాజ్‌, ఎస్సై శ్రీకాంత్‌, సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. కంపెనీ పేమెంట్స్‌, అకౌంట్లకు సంబంధించిన సమాచారం సేకరించి నిజామాబాద్‌కు చెందిన మెడిలైఫ్‌ మార్కెటింగ్‌ ఎగ్జిక్యూటివ్‌ సాగర్‌ను అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. మేనేజింగ్‌ డైరెక్టర్‌ సగయ రాజ్‌కుమార్‌, సీనియర్‌ ఎగ్జిక్యూటివ్‌ రవిచంద్రన్‌, ఇంకా బాధ్యులైన ఇతరులపై విచారణ కొనసాగిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ చైన్‌ సిస్టంలో చాలా మంది బాధితులు ఉండే అవకాశం ఉందని ఏసీపీ తెలిపారు. ప్రజలు ఇలాంటి కంపెనీలు నమ్మి మోసపోవద్దని ఆయన సూచించారు. ఆర్‌బీఐ గుర్తించిన బ్యాంకుల్లోనే డిపాజిట్‌ చేయాలన్నారు.

ముగియనున్న మున్సిపల్‌ పదవీకాలం

- ఈనెల 26 తర్వాత మాజీలు కానున్న చైర్మన్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు
- మళ్లీ అధికారం చేపట్టాలని ప్రయత్నాలు ప్రారంభించిన పార్టీలు



దండు నీతు కిరణ్‌ | వన్నెల్‌దేవ్‌ లావణ్య | తూము పద్మ శరత్‌రెడ్డి | కన్నె ప్రేమలత

ఆర్మూర్‌: రాష్ట్రంలో మున్సిపల్‌ పాలకవర్గాల పదవీ కాలం ఈ నెల 26తో ముగియనుంది. ఈక్రమంలో జిల్లాలో ఉన్న నిజామాబాద్‌ కార్పొరేషన్‌తోపాటు ఆర్మూర్‌, బోధన్‌, భీమ్‌గల్‌ మున్సిపాలిటీల చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పదవులు వీడనున్నారు. అయితే రానున్న ఎన్నికల్లో అధికారం చేపట్టడానికి ఆయా పార్టీలు ఇప్పటి నుంచే ప్రయత్నాలు ప్రారంభించాయి.

బీసీ మహిళా చైర్‌పర్సన్‌లు..

నిజామాబాద్‌ కార్పొరేషన్‌ మేయర్‌ పీఠంతో పాటు ఆర్మూర్‌, బోధన్‌, భీమ్‌గల్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ పీఠాలన్నీ బీసీ మహిళలకు రిజర్వు అయ్యాయి. నిజామాబాద్‌ మేయర్‌గా బీఆర్‌ఎస్‌కు చెందిన దండు నీతూకిరణ్‌ ఐదేళ్ల పాటు విజయవంతంగా బాధ్యతలు నిర్వహించారు. ఆర్మూర్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌గా బీఆర్‌ఎస్‌కు చెందిన పండిత్‌ వినీత మొదట బాధ్యతలు స్వీకరించి నాలుగేళ్ల పాటు బాధ్యతలు నిర్వహించారు. రాష్ట్రంలో అధికార మార్పు అనంతరం మెజారిటీ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరి, 2024 జనవరిలో అవిశ్వాస తీర్మానం పెట్టారు. మార్చిలో కాంగ్రెస్‌ అభ్యర్థి వన్నెల్‌దేవి లావణ్య చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అలాగే బోధన్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌గా బీఆర్‌ఎస్‌కు చెందిన తూము పద్మాశరత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టగా, రాష్ట్రంలో అధికార మార్పుతో ఆమె కాంగ్రెస్‌లో చేరి, బాధ్యతలు కొనసాగించారు. భీమ్‌గల్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ ఎన్నికలో నాటి బీఆర్‌ఎస్‌ నాయకులు అధికార బదిలీ ఒప్పందం చేయడంతో మొదట మల్లెల రాజశ్రీ అనంతరం కన్నె ప్రేమలత చైర్‌పర్సన్‌లుగా ఎన్నుకోబడ్డారు. కన్నె ప్రేమలత బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. దీంతో నిజామాబాద్‌ కార్పొరేషన్‌ మినహా ఆర్మూర్‌, బోధన్‌, భీమ్‌గల్‌ మున్సిపాలిటీలు కాంగ్రెస్‌ పార్టీ వశమయ్యాయి. మరో ఐదారు రోజుల్లో మున్సిపల్‌ పాలకవర్గాల పదవీకాలం ముగియనుంది. తర్వాత జరిగే మున్సిపల్‌ ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారో పూర్తి స్పష్టత రాలేదు. కాగా ఆయా మున్సిపాలిటీలపై తమ జెండా ఎగరవేసి పట్టు సాధించడం కోసం కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌, బీజేపీ నాయకులు ఇప్పటికే ప్రయత్నాలను ప్రారంభించారు.

ఇదీ పరిస్థితి..

2019–2020 నాటి ఎన్నికల్లో పలు గ్రామాలను విలీనం చేయడం ద్వారా 2011 జనాభా లెక్కల ఆధారంగా నిజామాబాద్‌ కార్పొరేషన్‌ పరిధిలో 60 వార్డులను, ఆర్మూర్‌ మున్సిపాలిటీ పరిధిలో 36 వార్డులను, బోధన్‌ మున్సిపాలిటీ పరిధిలో 38 వార్డులను, భీమ్‌గల్‌ మున్సిపాలిటీ పరిధిలో 12 వార్డులను విభజించి రిజర్వేషన్లు సైతం ఖరారు చేసి ఎన్నికలను నిర్వహించారు. 2020 జనవరిలో ఆయా మున్సిపాలిటీలకు కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. నాటి ఎన్నికల్లో కార్పొరేషన్‌తో పాటు మూడు మున్సిపాలిటీలను బీఆర్‌ఎస్‌ కైవసం చేసుకోగా రాష్ట్రంలో అధికార మార్పు అనంతరం పార్టీ ఫిరాయింపులతో నిజామాబాద్‌ కార్పొరేషన్‌ మినహా ఆర్మూర్‌, బోధన్‌, భీమ్‌గల్‌ మున్సిపాలిటీలు కాంగ్రెస్‌ ఖాతాలో జమ అయ్యాయి.

సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ

- అర్హులందరికీ రేషన్‌ కార్డులు, ఇతర పథకాలు వర్తింపు
- ఇప్పటికీ దరఖాస్తులు చేసుకోని వారు అర్జీలు సమర్పించాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు పొంగులేటి, ఉత్తమ్‌, తుమ్మల



వీసీలో పాల్గొన్న కలెక్టర్‌ హనుమంతు, అదనపు కలెక్టర్లు, అధికారులు

నిజామాబాద్‌అర్బన్‌: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న నాలుగు సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి వర్తింపజేస్తామని మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్‌ కుమార్‌ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి స్పష్టం చేశారు. శనివారం రాత్రి రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఆహార భద్రత(రేషన్‌ కార్డులు), రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు నిరంతర ప్రక్రియ గా అమలు చేయనున్నట్లు మంత్రులు స్పష్టం చేశారు. ఇప్పటికే ప్రజాపాలన కార్యక్రమం ద్వారా ఆ యా పథకాల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు గుర్తు చేశారు. వాటికి సంబంధించి ప్రతి రెవెన్యూ గ్రామంలో అధికార బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్నాయన్నారు. ఇప్పటికీ ఎవరైనా రేషన్‌ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు తదితర పథకాల కోసం దరఖాస్తు చేసుకోనట్లయితే, అలాంటి వారు కూడా ప్రస్తుతం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న గ్రామ సభలలో కూడా అర్జీలు సమర్పించవచ్చని తెలిపారు. వీలుపడని వారు ప్ర జాపాలన సేవా కేంద్రాలలో సంక్షేమ పథకాల కో సం దరఖాస్తులు అందించవచ్చన్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్‌ కార్డులు, ఇతర పథకాల కోసం తెల్ల కాగితాలపై వచ్చిన దరఖాసుల్తను సైతం పరిశీలిస్తామన్నారు. సంక్షేమ పథకాలు వర్తింపజేసే కార్యక్రమం నిరంతరంగా కొనసాగుతుందన్నారు. ఇటీవల జరిగిన సామాజిక, ఆర్థిక సర్వేలోనూ రేషన్‌ కార్డులు అవసరం ఉన్న కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్‌ కార్డులు, ఇతర పథకాలు అందజేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని, అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మొద్దని మంత్రులు పేర్కొన్నారు. ఆయా సంక్షేమ పథకాల కింద దరఖాస్తులు చేసుకునే వారి నుంచి అర్జీలు స్వీకరించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు మంత్రులు, సీఎస్‌ సూచించారు. ఎలాంటి గందరగోళం, తప్పిదాలకు తావు లేకుండా గ్రామ సభలు సజావుగా జరిగేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రైతు భరోసా పథకం అమలులో భాగంగా నియమించిన విచారణ బృందాలు వ్యవసాయ యోగ్యం కాని భూముల వివరాలను పక్కాగా నమోదు చేయాలని మంత్రులు సూచించారు. వ్యవసాయ అధికారులు, తహసీల్దార్లు సమన్వయంతో పని చేసి నివేదిక అందించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల వద్ద పంట సాగు వివరాలు, తహసీల్దార్ల వద్ద నాల భూముల కన్వర్షన్‌ వివరాలు పరిశీలన్నారు. అర్హులైన ప్రతి ఒక్క రైతుకు రైతు భరోసా అమలవుతుందన్నారు. ఇందిరమ్మ ఇల్లు అర్హులైన ప్రతి కుటుంబానికి మంజూరు చేస్తామన్నారు. గ్రామసభలు నిర్వహించి చర్చిస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్‌ అంకిత్‌, కిరణ్‌ కుమార్‌, డీఆర్డీవో సాయాగౌడ్‌, డీఎస్‌వో అరవింద్‌ రెడ్డి, సివిల్‌ సప్లైస్‌ డీఎం రాజేశ్వర్‌, జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్‌ హుస్సేన్‌ తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా చివరి సమావేశం !

- ఎజెండా అంశాలు చర్చించకుండానే ముగిసిన నిజామాబాద్‌ నగర మున్సిపల్‌ కౌన్సిల్‌ సమావేశం



మేయర్‌ నీతూ కిరణ్‌ చాంబర్‌ ఎదుట ఎంఐఎం కార్పొరేటర్ల నిరసన



ధర్నా చేస్తున్న బీజేపీ కార్పొరేటర్లు

నిజామాబాద్‌ సిటీ : నిజామాబాద్‌ నగర మున్సిపల్‌ కౌన్సిల్‌ చివరి సమావేశం శనివారం రసాభాసాగా సాగింది. ఎజెండా అంశాలు చర్చించకుండానే సమావేశాన్ని ముగించేశారు. నగరంలోని పలు కూడళ్లలో తోపుడు బండ్లు, కూరగాయలు అమ్మేవారిని తొలగించకుండా అక్కడే అమ్ముకోనివ్వాలనే అంశం ఎజెండాలో చేర్చాలని ఎంఐఎం కార్పొరేటర్లు పట్టుపట్టారు. నిబంధనలు ఒప్పుకోవని చెప్పడంతో మేయర్‌ నీతుకిరణ్కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పది నిమిషాలు సభ వాయిదా పడింది. నగరంలో అక్రమ కట్టడాలు, రోడ్ల ఆక్రమణపై బీజేపీ కార్పొరేటర్లు ప్రతి నినాదాలు చేశారు. రెండు గంటల పాటు ఆందోళనతో మేయర్‌ సభ ముగిసిందని ప్రకటించారు.

బీజేపీ, ఎంఐఎం కార్పొరేటర్లు మేయర్‌ చాంబర్‌ ముందు ధర్నాకు దిగారు. సమావేశానికి ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్తా హాజరయ్యారు.

క్లుప్తంగా

నేడు జిల్లాకు మంత్రి జూపల్లి రాక

నిజామాబాద్‌అర్బన్‌: మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదివారం జిల్లాకు రానున్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల స్కీమ్‌లపై సమీక్ష నిర్వహిస్తారు. పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలోని భరోసా సెంటర్, గోల్ హనుమాన్ జోన్ ఆఫీస్ ప్రారంభిస్తారు. వాటర్ డ్రైనేజీ కాలువకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం బహిరంగసభలో పాల్గొంటారు.

నేడు కోర్టు ఉద్యోగాలకు పరీక్ష

ఖలీల్‌వాడి: నిజామాబాద్ లీగల్ అథారిటీ ఆధ్వర్యంలో కోర్టులో మూడు రికార్డు అసిస్టెంట్, ఒక టైపిస్ట్ కమ్ అసిస్టెంట్ పోస్టులకు ఆదివారం పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అథారిటీ చైర్‌పర్సన్ సునీత కుంచాల తెలిపారు. నగరంలోని వసుధ స్కూల్‌లో పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సకాలంలో హాజరు కావాలని సూచించారు.

తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన ఎన్టీఆర్

- మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు



డిచ్‌పల్లి: తెలుగు వారి ఖ్యాతిని ప్రపంచానికి చాటిన గొప్పవ్యక్తి దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అని మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని ధర్మారం(బి) పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, ప్రొఫెసర్ గోపాలం విద్యాసాగర్, ఈదర పిచ్చయ్య, రావుల బ్రహ్మానందం, నాయుడు ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు రేషన్ కార్డు అందాలి



బోధన్‌టౌన్: అర్హులందరికీ రేషన్ కార్డు అందాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. కొత్త రేషన్ కార్డుల జారీ కోసం పట్టణంలో నిర్వహిస్తున్న సర్వేను శనివారం సబ్ కలెక్టర్ వికాస్ మహతోతో కలిసి ఆయన పరిశీలించారు. సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటనారాయణ, సిబ్బంది ఉన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

ఖలీల్‌వాడి: జిల్లా కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో శనివారం డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య శనివారం సమీక్ష నిర్వహించారు. మాదక ద్రవ్యాలను నూతన చట్టాల ద్వారా అరికట్టే చర్యల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రాజేశ్వర్, రాజారెడ్డి, బంటు వసంత్, శ్యాంరావు, నిమ్మ దామోదర్ రెడ్డి, శ్రీనివాస్ ఖాందేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ ఎంట్రెన్స్ టెస్టు నోటిఫికేషన్ విడుదల

నిజామాబాద్ అర్బన్: అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అపోలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌కేర్, కృష్ణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, దారుస్సలాం ఎడ్యుకేషన్ ట్రస్టు సంయుక్తంగా ఎంబీఏలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్‌ను విడుదలైంది. దీనికోసం ఫిబ్రవరి 15లోపు దరఖాస్తు చేసుకోవాలని అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే యూనివర్సిటీ డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం, పీజీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఈ నెల 25లోపు ట్యూషన్ ఫీజు రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు.

ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీల ఏర్పాటు

- రోడ్డుకు అడ్డంగా పెట్టినా పట్టించుకోని అధికారులు
- మూలమలుపుల వద్ద ప్రమాదకరంగా ఫ్లెక్సీలు



డివైడర్ల మధ్య స్తంభాలకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ



ఎల్లమ్మగుట్ట వద్ద విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన పీఎంజే జువెల్లర్స్ ఫ్లెక్సీలు

నిజామాబాద్ సిటీ: నగరంలో ఇష్టారాజ్యంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు. వస్త్ర, నగల దుకాణాల ప్రారంభోత్సవాలకు భారీ సంఖ్యలో ఫ్లెక్సీలు పెడుతున్నారు. బల్దియా నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి నిజామాబాద్ బస్టాండ్ వైపు వచ్చే రోడ్డు అసలే ఇరుకుగా ఉంది. ఈ రోడ్డుకు అడ్డంగా వందల సంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఫ్లెక్సీ రోడ్డుకు దగ్గరలో పెట్టడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రెండు రోజుల్లో ఇలా నాలుగు ప్రమాదాలు జరిగాయి. అయినా సంబంధిత వ్యక్తులు వాటిని తొలగించడం లేదు. టౌన్‌ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. ఫ్లెక్సీలు ఒక్క రోజుకు మించి ఉంచకూడదు అన్న నిబంధనలు ఖాతరు చేయడం లేదు.

ప్రమాదకరంగా పీఎంజే జువెల్లర్స్ ఫ్లెక్సీలు

నగరంలోని హైదరాబాద్ రోడ్డులో పీఎంజె జువెల్లర్స్ ప్రారంభించారు. వారం రోజులకు ముందుగానే నగరంలోని అన్ని చౌరస్తాల్లో పెద్దపెద్ద ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. ఆ షోరూం పక్కన ఉన్న ఉర్దూ మీడియం పాఠశాల కనిపించకుండా ఫ్లెక్సీలతో నింపారు. నగరశివారులోని ఖానాపూర్ బైపాస్, కంఠేశ్వర్‌బైపాస్, అర్సపల్లి బైపాస్‌ల వద్ద కూడా పెద్ద పెద్ద ఫ్లెక్సీలు ప్రమాదకరంగా పెట్టారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగినా పోలీసు సిబ్బంది స్పందన లేదు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు పెడుతుండటంతో మున్సిపల్‌కు ఆదాయం రావడం లేదు.



దేవీరోడ్డులో..

మాముళ్లు అందడంతోనే అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

అనుమతులు ఇవ్వలేదు

నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలకు అనుమతులు ఇవ్వలేదు. అనుమతి లేకుండా ఫ్లెక్సీలు పెడితే చర్యలు తప్పవు. ఫిర్యాదుచేస్తే వాటిని తొలగిస్తాం. కానీ తగినంత సిబ్బంది లేని కారణంగా జాప్యం జరుగుతోంది. ఫ్లెక్సీలు తొలగిస్తే రాజకీయ ఒత్తిడులు తప్పడం లేదు. – సత్యనారాయణ, టీపీవో

వెంటనే ఫిర్యాదు చేయాలి

నగరంలో ఎలాంటి సమస్యలున్నా వెంటనే అధికారులకు ఫిర్యాదు చేయాలి. అధికారులు స్పందించకుంటే వారిపై చర్యలు తప్పవు. అందరికీ ఒకే న్యాయం ఉంటుంది. నగర అభివృద్ధి సుందరీకరణే మా ధ్యేయం.

– దిలీప్ కుమార్, మున్సిపల్ కమిషనర్

వలస కార్మికులను బంధించి వసూళ్లు

- థాయ్‌లాండ్‌లో ఉపాధి కల్పిస్తామని ఏజెంట్ల మోసం
- ఇరు కుటుంబాలకు రూ.7 లక్షల చొప్పున నష్టం

మోర్తాడ్(బాల్కొండ): విదేశాల్లో ఉపాధి కల్పిస్తామని నమ్మించి మోసగించడమే కాకుండా వలస కార్మికులను తమ వద్ద బందీలుగా చేసుకుని, ఇంటికి పంపించాలంటే మరికొంత డబ్బును బలవంతంగా వసూళ్లు చేసిన ఏజెంట్ల ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం శెట్‌పల్లికి చెందిన సాగర్, జగిత్యాల్ జిల్లా మోహన్‌రావుపేట్‌కు చెందిన అరవింద్ దగ్గరి బంధువులు. ఇక్కడ సరైన ఉపాధి అవకాశాలు లభించకపోవడంతో గల్ఫ్ దేశాలకు వెళ్లాలని భావించారు. వీరిని గమనించిన మెట్‌పల్లి మండలం ఆత్మకూర్‌కు చెందిన ఒక ఏజెంట్ థాయ్‌లాండ్‌లో మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ఒక్కో వీసాకు రూ.5 లక్షలు చెల్లించాల్సి వస్తుందని తెలిపాడు. అక్కడ నెలకు రూ.1.50 లక్షల కంటే ఎక్కువ సంపాదించుకోవచ్చని ఏజెంట్ చెప్పిన మాటలు నమ్మిన సాగర్, అరవింద్‌లు రూ.5 లక్షల చొప్పున చెల్లించి గత సంవత్సరం నవంబర్‌లో ముంబై నుంచి బ్యాంకాక్ వెళ్లారు. అక్కడి నుంచి థాయ్‌లాండ్ బోర్డర్‌ను దాటించడానికి మరికొద్ది మంది దళారులను ఏజెంట్లే నియమించారు. అక్కడే దళారులు సాగర్, అరవింద్‌లను బందీలుగా చేసుకుని అసలు నాటకానికి తెర లేపారు. బాధితుల నుంచి మొబైల్ ఫోన్‌లను లాక్కుని ఇంటికి మాట్లాడకుండా చేశారు. కొన్ని రోజుల తర్వాత థాయ్‌లాండ్‌లో తమవారు కనిపించకుండా పోయారని సాగర్, అరవింద్‌ల కుటుంబ సభ్యులు డిసెంబర్‌లో ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేయడంతోనే ఏజెంట్ల మోసం బయటపడింది.

ఏజెంట్ అరెస్టుతో బందీల ఆచూకీ..

ప్రవాసీ ప్రజావాణి గ్రీవెన్స్ సెల్ ప్రత్యేకాధికారి దివ్యాదేవరాజన్ స్పందించి వుమెన్స్ సేఫ్టీ వింగ్ అధికారిణి షికా గోయెల్‌కు సాగర్, అరవింద్‌ల సమస్యను వివరించడంతో పోలీసుల్లో చలనం వచ్చింది. ఆత్మకూర్‌కు చెందిన ఏజెంట్ సమ్మెట రాజును మోర్తాడ్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏజెంట్ తన అరెస్టు సమాచారాన్ని థాయ్‌లాండ్‌లోని మరో ఏజెంట్‌కు వెళ్లడించడంతో అతను అక్కడ బందీలుగా ఉన్న సాగర్, అరవింద్‌లతో వారి కుటుంబ సభ్యులకు ఫోన్‌లో మాట్లాడించడం మొదలు పెట్టారు. ఒక రోజు ఫోన్‌లో మాట్లాడించడానికి మన కరెన్సీలో రూ.1,500 నుంచి రూ.2 వేలు పంపించాల్సిన దుస్థితి ఏర్పడిందని బాధిత కుటుంబ సభ్యులు వివరించారు. అలా దళారులు బాధిత కుటుంబ సభ్యుల నుంచి డబ్బులు లాగడం మొదలు పెట్టి చివరకు తమ చెరలో ఉన్న వారిని ఇంటికి పంపించాలంటే రూ.2 లక్షల చొప్పున తాము సూచించిన బ్యాంకు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. తమవారు క్షేమంగా ఇంటికి వస్తే సరిపోతుందనే ఉద్దేశంతో ఇటీవల రూ.4 లక్షలు చెల్లించడంతో సాగర్, అరవింద్‌లు వారం రోజుల కింద ఇంటికి చేరుకున్నారు.

క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

నిజామాబాద్ అర్బన్: యువత క్రీడా స్ఫూర్తి అలవర్చుకోవాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని గిరిరాజ్ కళాశాలలో ఖేలో భారత్ క్రీడోత్సవ్ పోటీలను ఆయన ప్రారంభించారు. స్వామి వివేకానంద, సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా ఇలాంటి పోటీలు నిర్వహించాలని సూచించారు. ఏబీవీపీ ఇందూర్ విభాగ్ ప్రముఖ్ రెంజర్ల నరేశ్ మాట్లాడుతూ డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మిద్దామన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా మైదానాల్లో ఆడాలని యువతకు సూచించారు. కార్యక్రమంలో విభాగ్ సంఘటన మంత్రి రాజు సాగర్, గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి, కైరి శశిధర్, ప్రవీణ్, గొడుగు వెంకటకృష్ణ, దామ సుమన్, బాలకృష్ణ, గోపి, దుర్గాదాస్, మహేష్, ప్రీతం, గణేశ్ పాల్గొన్నారు.



క్రికెట్ ఆడుతున్న ఎమ్మెల్యే

మిల్లర్ల నుంచి బియ్యం రికవరీ చేయాలని వినతి

సుభాష్‌నగర్: జిల్లాలోని 41 రైస్‌మిల్లర్లు ప్రభుత్వానికి ఇవ్వాల్సిన రూ.417 కోట్ల విలువైన బియ్యాన్ని వెంటనే రికవరీ చేయాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, సీసీఏ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచర్ల సుదర్శన్ డిమాండ్‌చేశారు. ఈమేరకు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి అరవింద్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కస్టమ్ మిల్లింగ్ రైస్‌ను మిల్లర్లు సకాలంలో ప్రభుత్వానికి ఇవ్వకుండా మోసం చేశారని, వారిపై రెవెన్యూ రికవరీ యాక్ట్‌తోపాటు ఆయా ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయాలన్నారు. మిల్లర్లు కోర్టు ద్వారా తెచ్చుకున్న స్టేను వేకెట్ చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. కార్యక్రమంలో వినియోగదారుల సంక్షేమ సమితి జిల్లా అధ్యక్షుడు పెందోట అనిల్ కుమార్, సందు ప్రవీణ్, వీయస్ వర్మ, మహాదేవుని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



డీఎస్‌వో అరవింద్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వినియోగదారుల మండలి సభ్యులు

సైన్స్‌ఫెయిర్‌కు ఎంపికైన విద్యార్థులకు అభినందన

నిజామాబాద్ అర్బన్: రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో గెలుపొంది దక్షిణ భారత స్థాయికి ఎంపికైన విద్యార్థులను, గైడ్ టీచర్లను శనివారం డీఈవో అశోక్ అభినందించారు. జిల్లా నుంచి ఇన్‌స్పైర్‌లో ఒక ప్రాజెక్టు, సైన్స్ ఎగ్జిబిషన్‌లో నాలుగు ప్రాజెక్టులు సెలెక్ట్ అయినట్లు తెలిపారు. జనవరి 21 నుంచి 25 వరకు పాండిచ్చేరిలో జరిగే ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి గంగకిషన్, ఏసీఈ విజయభాస్కర్, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో

ఎంపికైన విద్యార్థులు

అంకిత(జెడ్పీహెచ్ఎస్, రెంజర్ల), నవదీప్‌సాయి(జెడ్పీహెచ్ఎస్, కంజర), విజితేంద్రియా(విజయ్ హై స్కూల్) శివమణి(మానిక్‌భవన్), గోవర్ధన్(సుద్దపల్లి).

ఆటలతో మానసిక ప్రశాంతత

- జిల్లా జడ్జి సునీత కుంచాల



ఖలీల్‌వాడి: ఆటలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. గణతంత్ర దినోత్సవాల సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు, న్యాయమూర్తుల క్రీడలను పాలిటెక్నిక్ గ్రౌండ్‌లో శనివారం ఆమె ప్రారంభించారు. న్యాయవాదులు, జడ్జీలు వృత్తి రిత్యా ఒత్తిడికి లోనవుతారని, ఆటలతో ఒత్తిడిని దూరం చేసుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్‌మోహన్ గౌడ్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు మంధని రాజేందర్, అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జి హరికుమార్, రాజు, వసంత్ రావు, సురేష్ దొన్పల్, పిల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

21న ఉచిత కాలేయ స్క్రీనింగ్ టెస్ట్

సుభాష్‌నగర్: తెలంగాణ ఆల్ పెన్షనర్స్–రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 21న నగరంలోని మల్లు స్వరాజ్యం ట్రస్ట్ భవన్‌లో ఉచిత కాలేయ స్క్రీనింగ్ టెస్ట్, హెల్త్ క్యాంపు నిర్వహించనున్నట్లు స్తున్నట్లు యూనియన్ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు తెలిపారు. శనివారం నగరంలోని ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.6వేల విలువైన ఈ టెస్టును రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యుల కోసం ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఎస్ మదన్మోహన్, ఈవీఎల్ నారాయణ, ప్రసాద్‌రావు, నరేందర్, చంద్రశేఖర్, రాధాకిషన్, పూర్ణచంద్ర రావు, సిర్ప లింగయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

మహిళ దారుణ హత్య

- ఏడు నెలల తర్వాత వెలుగులోకి..
- పోలీసుల అదుపులో నిందితులు

మోపాల్: మోపాల్ మండల కేంద్రంలో మహిళ దారుణ హత్యకు గురైంది. ఏడు నెలల తర్వాత ఘటన వెలుగులోకి రావడం శనివారం కలకలం రేపింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మోపాల్ గ్రామానికి చెందిన జంగం గంగారాం, విజయ భార్యభర్తలు. వీరికి మనోహర్, స్రవంతి సంతానం. దంపతుల మధ్య రెండేళ్ల క్రితం గొడవలు కావడంతో అప్పటి నుంచి దూరంగా ఉంటున్నారు. అదే గ్రామంలో ఉన్న చెల్లెలు భాగ్యలక్ష్మి వద్ద విజయ ఉంటోంది. ఏడు నెలల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిన విజయ తిరిగి రాకపోవడంతో భాగ్యలక్ష్మి, విజయ భర్త గంగారాంనకు తెలియజేసింది. కుటుంబానికి దూరంగా ఉంటుండటంతో వారు కూడా పట్టించుకోలేదు. అయితే ఈ నెల 16న విజయ కుమారుడు తన తల్లి కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన తల్లితో డబ్బుల విషయంలో రోడ్ బుచ్చన్నతో పలుమార్లు గొడవ జరిగిందని, ఆయనపై అనుమానముందని చెప్పాడు.



విజయ (ఫైల్)

అదేరోజు అనుమానితుల ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించా రు. విచారణలో హత్య చేసినట్లు నిందితులు ఒ ప్పుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సురేష్ తెలిపారు.

చిట్టీ డబ్బులు అడగడంతో..

మోపాల్‌కు చెందిన బుచ్చన్న వద్ద విజయ రూ.లక్ష చిట్టీ వేసేంది. చిట్టీ గడువు ముగిసినా.. డబ్బులు చెల్లించడంలేదు. దీంతో ఆమె బుచ్చన్నను డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చింది. దీంతో బుచ్చన్న ఎలాగైనా విజయ అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్నాడు. తన వద్ద పశువుల కాపరిగా ఉన్న కోటగిరి మండలం కొడిచర్లకు చెందిన నగేష్‌కు విషయాన్ని తెలియజేశాడు. నగేష్ విజయను నమ్మించి కల్లు తాగుదామని గ్రామ శివారున కల్వర్టు వద్దకు రప్పించాడు. కల్లు తాగిన తర్వాత ఆమె చీర కొంగుతో గొంతుకు ఉరి వేసి హత్యచేశాడు. అక్కడే పంట నీటి కాల్వలో మృతదేహాన్ని పూడ్చిపెట్టారు. శనివా రం విజయ మృతదేహాన్ని పాతిపెట్టిన చోట పో లీసులు జేసీబీతో వెలికితీశారు. ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి, సీఐ సురేశ్, ఎస్సై యాదగిరి గౌడ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఏడు నెలలు గడవడంతో ఎముకలు, చీర మాత్రమే తవ్వకాల్లో బయటపడ్డాయి. చీర విజయదే అని నిర్ధారణకు వచ్చిన పోలీసులు అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు.



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మైనర్లు వాహనాలను నడపొద్దు

భిక్కనూరు: మైనర్లు వాహనాలను నడిపించవద్దని జిల్లా రవాణాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. భిక్కనూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను పాటిస్తే రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అనంతరం భిక్కనూరులో పలు వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎంవీఐ నాగలక్ష్మి, ఏఎంవీఐలు అఫ్రోజ్, తేజ, అర్షద్, శంకర్, ఆర్టీవో సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీటీవో శ్రీనివాస్‌రెడ్డి

ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ

నందిపేట్: మండలంలోని తల్వేద ఎత్తిపోతల పథకం పరిధిలోని లక్కంపల్లి గ్రామ శివారులో గల రెండో పంపు హౌజ్ వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ కాయిల్స్ చోరీ అయ్యాయి. శుక్రవారం రాత్రి సమయంలో లక్కంపల్లి లిఫ్ట్ బావి వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులో నుంచి రాగి కాయిల్స్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు ఎత్తిపోతల కమిటీ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో సైతం తల్వేద మొదటి పంపు హౌజ్ వద్ద, సీహెచ్ కొండూర్, ఉమ్మెడ పంపుహౌజ్ వద్ద గల ట్రాన్స్‌ఫార్మర్ల రాగి తీగలను చోరీ చేశారు.



లక్కంపల్లి శివారులోని తల్వేద ఎత్తిపోతల పథకం వద్ద చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

సాక్షి సండే క్లాసిఫైడ్స్

SERVICES

DISTRIBUTORS

- Wanted Distributors for our Packaged Drinking Water Bottle under the brand name " PURE " in Telangana 9063254533. [SCA25001166]

BUSINESS SERVICES

- మీ బంగారం బ్యాంక్‌లో, ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9177555694. [SCA25001126]

WANTED

- Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256043]
- హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K.Ph: 9640468899,9640258899 [SCA25001191]
- షిరిడీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్ లో లేడి వార్డెన్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు,భార్యాభర్తలు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901. [HA-15309]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మురికి కాలువలో పసికందు మృతదేహం

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ కాలనీలోని మురికి కాలువలో నవజాత శిశువు మృతదేహం లభ్యమైంది. గుర్తు తెలియని వ్యక్తులు మగ శిశువు మృతదేహం పడేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆరుగురిపై కేసు నమోదు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని ఎర్రమన్ను కుచ్చ ప్రాంతానికి చెందిన ఖాజా దాదయ్య, అతని కుటుంబ సభ్యులపై దాడి చేశారన్న ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. తన ఇంటి పక్కనే ఉన్న టేకు కాశీరాం అనే వ్యక్తి తమ కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడేవారని బాధితుడు తెలిపినట్లు ఎస్సై తెలిపారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నీటి విషయమై ఇరు కుటుంబాలకు జరిగిన వివాదంలో కాశీరాంతో పాటు అతని కుటుంబ సభ్యులు తనతో పాటు తన తమ్ముడి భార్య నాగమణి, కోడలు శాంతను కట్టెలతో కొట్టారని ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కాశీరాం, ఆయన భార్య పోశవ్వ, కొడుకులు రమేష్, రాములు కోడలు అనిత, కూతురు సంధ్యపై కేసు నమోదు చేశామన్నారు.

తల్లీకొడుకు అదృశ్యం

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండలం యానంపల్లి గ్రామానికి చెందిన కంఠేశ్వర్ మేఘన(25), ఆమె కొడుకు గౌరీష్ (6) కనిపించకుండా పోయినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. శనివారం ఉదయం నుంచి ఇద్దరు కనబడటం లేదు. పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె అత్త సావిత్రి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

టైర్ పేలి రాయిని ఢీకొన్న ట్రాలీ ఆటో



నిజాంసాగర్: మహమ్మద్ నగర్ మండలం గాలీపూర్ శివారులో నిజాంసాగర్ ప్రధాన కాలువ మూలమలుపు వద్ద శనివారం ట్రాలీ ఆటో టైర్ పేలి బండరాయిని ఢీకొంది. ట్రాలీ ఆటోలో ఐస్‌బాక్సుల్లో ఉన్న చేపలు రోడ్డుపై పడి మృతి చెందాయి.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

లింగంపేట: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ప్రేమజంట శనివారం పోలీసులను ఆశ్రయించింది. గ్రామానికి చెందిన యువతి, యువకుడు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరు కావడంతో పెద్దలు పెళ్లికి నిరాకరించారు. దీంతో వారు యాదగిరిగుట్టలో పెళ్లి చేసుకొని, లింగంపేట పోలీసులను ఆశ్రయించారు. దాంతో ఎస్సై సుధాకర్ వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

రుద్రూర్: కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోతంగల్ మండలం కొడిచర్ల శివారు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు అప్పగించామన్నారు.

అటవీ భూమి చదును చేస్తున్న ట్రాక్టర్..

ఇందల్వాయి: ఇందల్వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ధర్పల్లి బీట్‌లో అటవీ భూమిని చదును చేస్తున్న ట్రాక్టర్‌ని శనివారం సీజ్ చేసినట్లు ఎఫ్‌ఆర్వో రవి మోహన్ భట్ తెలిపారు. అటవీ చట్టాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

చికిత్స పొందుతూ మృతి

భిక్కనూరు: ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని బస్వాపూర్‌లో చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన మహ్మద్ సాజీద్(60) కిరాణాషాపు నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. ఆయన రెండేళ్ల క్రితం గుండెకు శస్త్ర చికిత్స చేయించుకున్నాడు. అప్పటి నుంచి తరుచూ అనారోగ్యానికి గురవుతున్నాడు. ఈ క్రమంలో గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి కుమారుడు రషీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

స్వాగత తోరణాన్ని ఢీకొన్న లారీ

నిజామాబాద్ రూరల్: నగర శివారులోని ఖానాపూర్ స్వాగత తోరణాన్ని లారీ ఢీకొట్టింది. శుక్రవారం రాత్రి లారీ ఢీకొనడంతో కమాన్ కూలిపోయింది. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలు అయ్యాయి.



కూలిపోయిన ఖానాపూర్ స్వాగత తోరణం